# మరో సారా కథ

యింట్లోకి అడుగు పెట్టానో లేదో "అదేంట్రా అయ్యా.. బంగారంలాంటి ఉద్యోగం వదిలేస్తానన్నావట" అంటూ అమ్మ ఎదురొచ్చింది. ఆమె వాలకాన్నిబట్టి చూస్తే నా రాకకోసం కొన్ని గంటలుగా ఎదురు చూస్తున్నట్టనిపించింది.

"ఔనమ్మా. నా చాతకావటం లేదమ్మా"

"అలాగంటే ఎలాగయ్యా. సంసారాన్ని లాక్కురావాలంటే ఏదో ఒకటి చేయాలిగా. ఉద్యోగాల్లేక ఎంతో మంది అల్లాడుతుంటే ఉన్న ఉద్యోగాన్ని వదులుకుంటానంటావే. ఎవరైనా వింటే నవ్విపోతారు."

"నవ్వితే నవ్వనీ. నేను మాత్రం ఆ ఉద్యోగం చేయను. సంసారం కోసం ఏదో ఒకటి చేయాలని నాకు తెలీదా... ఈ పని తప్ప ఏదైనా చేస్తానమ్మా. అవసరమైతే కూలిపని చేసి నిన్నూ నా భార్యని పోషించుకుంటానమ్మా."

"నెల తిరిగేసరికల్లా బిళ్ళకుడుంలా జీతం డబ్బులు చేతికందే గవర్నమెంటు ఉద్యోగం వదిలేసి కూలిపని చేస్తానంటావేందిరయ్యా. తొందరపడకుండా నిదానంగా ఆలోచించు. నువ్వూ పెద్దోడివైనావు. మంచీ చెడ్డా అన్నీ తెల్సినోడివి."

"అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చానమ్మా. మనసు చంపుకుని ఈ కొలువు చేయలేను."

అమ్మ ఏమనుకుందో ఏమో నావైపు అదోలా చూసి వెళ్ళిపోయింది.

లోపలికెళ్ళి యూనిఫాం విప్పేసి హేంగర్‌కి తగిలించి స్నానం చేసొచ్చాను. ఎప్పుడూ

దుమికే జలపాతంలా గలగలా మాట్లాడే పూర్ణ ముభావంగా భోజనం వడ్డించింది.

"నాకొక్కడికే పెట్టావేమిటి?" అన్నాను ఆశ్చర్యపోతూ. మామూలుగా ఐతే రాత్రి భోజనాలు ముగ్గురం కలిసే చేస్తాం.

"మేమిద్దరం తర్వాత్తింటాం" అంది ఎటో చూస్తూ.

యిద్దరూ అలిగినట్టున్నారు. నిన్న రాత్రే పూర్ణతో ఉద్యోగం మానేయ్యాలనుకుంటున్న విషయం చెప్పాను. చెప్పకుండా ఉంటే బాగుండేదేమో.. అమ్మనీ పూర్ణనీ మానసికంగా సంసిద్ధం చేయకుండా ఉద్యోగాన్ని వదిలేస్తే తట్టుకోలేరనిపించి ముందస్తుగా చెప్పాను. ఒకరు మౌనంగా మరొకరు మాటలతో సాధించేలా ఉన్నారు. ఏది ఏమైనా నానిర్ణయాన్ని మాత్రం మార్చుకోను.

నేను గదిలోకెళ్ళి పడుకున్న చాలా సేపటివరకు అత్తా కోడళ్ళు వంట గదిలో గుసగుసలుగా మాట్లాడుకోవటం విన్పిస్తూనే ఉంది. పదిన్నర దాటాక పూర్ణ వచ్చి మంచం మీద అటు వైపుకు తిరిగి పడుకుంది.

ఓ పావు గంట తర్వాత లేచి కూచుని "నిద్ర పోతున్నారా" అని అడిగింది.

"లేదు"

"మీ ఉద్యోగాల్లో పై అధికార్లు బాగా సతాయిస్తారటగా. అవి తట్టుకోలేక మానేస్తున్నారా?"

"బండ బూతులు కూడా తిడ్తారు. మొదట్లో బాధగా ఉండినా రాన్రాను అలవాటై పోయాయి. ఆ కారణం వల్ల కాదు. నా మనసుకే నచ్చటం లేదు."

"అందరూ మనసుకి నచ్చిన కొలువులే చేస్తున్నారా?"

"అందరి సంగతి నాకు తెలీదు. నా మనస్సాక్షికి విరుద్ధంగా చేస్తున్న ఈ ఉద్యోగం మాత్రం నన్నూ నా ఆత్మని కొద్దికొద్దిగా కొరుక్కుని తినేస్తోంది. నన్ను నేను పూర్తిగా కోల్పోక ముందే జాగ్రత్తపడ్తున్నా. అందుకే ఉద్యోగం వదిలేస్తున్నా."

"మనస్సాక్షి, ఆత్మల్లాంటి పెద్ద మాటలు నాకర్థంకావు. ఈ రోజుల్లో ఉద్యోగం లేకుండా సంసారాన్ని పోషించటం మాటలనుకుంటున్నారా? నాగురించీ అత్తయ్య గురించీ ఆలోచించారా?"

"ఈ ఉద్యోగం మానేస్తే మరో ఉద్యోగం తెచ్చుకోలేనా... ఓ వేళ మరో ఉద్యోగం దొరక్కున్నా పర్లేదు. ఏదో ఓ పని చేసి మిమ్మల్ని బతికించుకోగలనన్న నమ్మకం నాకుంది. నన్నెందుకర్థం చేసుకోరూ?"

"అర్థం చేసుకోవాల్సింది మేము కాదు... మీరు. మరో మూడు నాలుగు నెలల్లో మనకు బాబో పాపో పుడ్తారు. కనీసం వాళ్ళ భవిష్యత్తు గురించైనా ఆలోచించారా?"

"వాళ్ళకోసమేగా. జీతం డబ్బుల కోసం ఆత్మను కుదువపెట్టిన తండ్రికి పుట్టామని చెప్పుకోవడం వాళ్ళకి బావుంటుందా చెప్పు?"

"అయ్యో నా ఖర్మ.. ఈ ఆత్మలేమిటి? కుదువపెట్టడాలేమిటి? ఆ ఉద్యోగం ఉండబట్టేగా పూటకింత తినగలుగుతున్నాం."

"డొంకతిరుగుడొద్దు. నువ్వు చెప్పాలనుకున్న విషయం సూటిగా చెప్పు."

"సరే చెప్తాను. మీ ఉద్యోగాన్ని చూసే మా వాళ్ళు నన్నిచ్చి పెళ్ళి చేసింది. యిపుడు ఉద్యోగం సద్యోగం లేకుండా నా గొంతూ పుట్టబోయేవాడి గొంతూ కోస్తారా? అయ్యో దేవుడా!"

పూర్ణ చాలాసేపటివరకు ఏడుస్తూ ఉండింది. ఏ అర్ధరాత్రి దాటాకో ఆమె వెక్కిళ్ళు ఆగిపోయాయి. బహుశా నిద్ర పట్టి ఉంటుంది.

నాకు నిద్ర రాలేదు. ఆలోచనలు... నిద్రని రానివ్వకుండా రెప్పలపైన వాలిపోతున్న ఆలోచనలు...మెదడు పొరల్ని తొలిచే కొద్దీ వూటలా వూరుతున్న ఆలోచనలు..

డిగ్రీ సగంలో ఆగిపోయిన నాకు ఏం ఉద్యోగాలొస్తాయని... చివరికి ప్యూన్ ఉద్యోగాలకి కూడా ప్రయత్నించి విసిగి వేసారి ఉన్న సమయంలో నా మిత్రుడొకడు సలహా యిచ్చాడు. 'మంచి ఒడ్డూ పొడవూ ఉంటావు. పోలీసుల్లో భర్తీ కావచ్చు కదా' అని. అధికోత్సాహంతో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ప్రయత్నించా. రాలేదు. ఎక్సయిజ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి మిత్రులు కొంత మంది దరఖాస్తు చేస్తూ నన్నూ చేయమన్నారు.

'ఛత్.. ఆ ఉద్యోగమా? తాగుడంటే నాకెంత అసహ్యమో మీకు తెల్సుగా. స్టేట్ ఎక్సయిజ్ అంటేనే సారాయి కొట్ల వేలం పాటలు..తాగుడు వ్యవహారం. నాకొద్దు' అన్నాను.

'అప్లికేషన్ పెట్టగానే ఉద్యోగం వచ్చేసినట్టు మాట్లాడ్తున్నావే... యిప్పటివరకు ఎన్నో

ఉద్యోగాలకి ప్రయత్నించి బొక్కబోర్లా పళ్ళేదూ... దానికింకొటి జమ. అంతే' అన్నారు వాళ్ళు.

అయిష్టంగానే అప్లికేషన్ పెట్టాను. వద్దనుకుంటూనే పరీక్ష రాశాను. నా దురదృష్టం నన్ను వెంటాడిందేమో వద్దనుకున్న ఉద్యోగమే వచ్చింది.

ఎక్సయిజ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చిందని తెల్సిన రోజు చాలా అయోమయానికి లోనైనాను. బాధ పడాలో సంతోషపడాలో తెలీని సందిగ్ధావస్థ...

మద్యానికి బానిస కావొద్దని, మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరమని ప్రజలకు చెప్పాల్సిన ప్రభుత్వమే ప్రణాళికాబద్ధంగా ప్రజల్ని తాగుబోతులుగా మార్చడానికి ఏర్పాటుచేసుకున్న వ్యవస్థే ఎక్సయిజ్ శాఖ. ప్రతేడాది మద్యం అమ్మకాల్ని పెంచుకోవడం ద్వారా ఖజానా నింపుకోవాలన్న ఆలోచన తప్ప ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడ్తున్నామన్న ధ్యాసే లేని ప్రభుత్వసంస్థలో ఉద్యోగిగా ససేమిరా పన్చేయనని చెప్పాను.

'సర్కారీ కొలువు అందరికీ దొరకదు బాబూ. వద్దనకు. మన వంశంలో గవర్నమెంటు ఉద్యోగం తెచ్చుకున్న మొట్టమొదటివాడివి నువ్వే. మీ నాన్నే బతికుంటే ఎంత సంతోషపడి ఉండే వారో' అంటూ అమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది.

'నాన్న తాగుడుకి బానిసై నిన్నూ నన్నూ ఎంత కష్టపెట్టాడో తెలిసికూడా అలా అంటే ఎలాగమ్మా. పదో తరగతిలో నా పరీక్ష ఫీజుకోసం దాచుకున్న డబ్బుని కూడా పట్టుకెళ్ళి తాగేశాడే. అదేమని అడిగిన పాపానికి మనిద్దర్నీ గొడ్డుని బాదినట్టు బాదాడే. మనుషుల్ని పశువులకన్నా హీనంగా మార్చే మద్యం తయారీ, అమ్మకాలకు సంబంధించిన డిపార్ట్‌మెంట్లో ఉద్యోగం చేయడానికి మనసెలా ఒప్పుతుందమ్మా' అన్నాను.

నాన్న వ్యవసాయం చేసేవాడు. మా తాతగారి నుంచి సంక్రమించిన ఐదెకరాల పొలంలో మెట్ట పంటలు పండించేవాడు. పంటలు బాగా పండిన సంవత్సరం ఆ వచ్చిన డబ్బంతా తాగి తగలేసేవాడు. పంటలు పండని రోజుల్లో అప్పులు చేసి తాగేవాడు. సారాయి తాగి తాగి యాభయ్ యేళ్ళు నిండకుండానే అనారోగ్యంతో చచ్చిపోయాడు.

దాదాపు ఐదు వందల గడపలున్న గ్రామం మాది. నాకైదేళ్ళ వయసొచ్చేవరకు మా అమ్మ కన్నీళ్ళు పెట్టుకోవటం నేను చూళ్ళేదు. ఓ రోజు మా వూళ్ళో సారాయి కొట్టు తెరిచారు. మొదట్లో తిట్టుకున్న గ్రామస్థులే మెల్లమెల్లగా తాగుడుకి అలవాటు పడ్డారు.

నాన్నకి వ్యవసాయం మీదకన్నా సాయంత్రం ఎప్పుడౌతుందా సారాయి కొట్టుకెప్పుడెళ్దామా అనేదానిమీదే ధ్యాస ఉండేది. అమ్మ నగలు తాకట్టు పెట్టి ఎరువులు కొంటానికి తెచ్చిన డబ్బులు తీస్కెళ్ళి తాగేసేవాడు. పంటలు సరిగా పండేవి కావు. పేదరికం... ఆకలి... అప్పులు... అవమానాలు. నేనూ అమ్మా ఐదెకరాల పొలం ఉండి కూడా దుర్భరమైన జీవితం గడపడానికి కారణం మా నాన్న తాగుడుకి బానిస కావటం..

నా చదువు చట్టుబండలు కావడానికి కారణం ఈ సారాయి రాక్షసే. చిన్నప్పటినుంచీ నాలో బలంగా ఓ కోరిక నాటుకుపోయింది. నరకాసురుణ్ణి వధించినట్టు ఈ సారా రాక్షసిని కూడా ఎవరైనా వధిస్తే మాలాంటి చాలా కుటుంబాలు బాగు పడ్తాయని.

తప్పు నాన్నది కాదు. పచ్చగా కళకళలాడ్తున్న మా పల్లెటూరిని వల్లకాడుగా మార్చేసే సారాయి కొట్టుకి పర్మిషనిచ్చిన ప్రభుత్వానిది. అటువంటి ప్రభుత్వసంస్థలో నేనెలా భాగం కాగలను?

కానీ, ఉద్యోగం వచ్చిందని తెలిసి అభినందించడానికొచ్చిన స్నేహితుల మాటలు నన్ను ఆలోనలో పడేశాయి.

'నీ ఆలోచన తప్పు. నువ్వు మరీ సెంటిమెంట్‌తో ఆలోచించటం వల్ల ఈ ఉద్యోగంవల్ల కలిగే లాభాల్ని స్పష్టంగా చూళ్ళేకపోతున్నావు. నీకు సారాయిమీదున్న కసంతా తీర్చుకునే అవకాశం దీనివల్ల దొరుకుతుంది. అక్రమంగా సారాయి తయారుచేస్తున్న వాళ్ళమీద ఉక్కుపాదం మోపు. కల్తీసారావల్ల చనిపోతున్న వేలాదిమంది అభాగ్యుల జీవితాల్ని ఆదుకున్నవాడివవుతావు' అన్నారు.

ఆ వూహకే నా ఛాతీ అరంగుళం పొంగింది. సినిమాల్లో చూసిన కొన్ని సీన్లు గుర్తొచ్చాయి. కుండల్లో సారా కాస్తుంటారు. హీరో ప్రవేశం... లాఠీతో వాటిని పగులకొట్టుంటాడు. గూండాలు అడ్డు పడ్తారు... ఫైటింగ్...

ట్రైనింగ్ తర్వాత సమరోత్సాహంతో ఉద్యోగంలో జాయినైనా. ధూల్‌పేటలో ఓ యింటి వెనక యాదగిరి అనే వ్యక్తి సారాయి అక్రమంగా తయారు చేస్తున్నాడని తెలిసి రెక్కీచేసి వివరాలన్నీ సేకరించి, మా యస్సయ్ గారికి చెప్పాను. ఆ సమాచారం విని ఉద్విగ్నానికి లోనవుతాడనుకుంటే అతను చిద్విలాసంగా నవ్వి 'హెడ్‌ని పిలువ్... గిదేం పరేషాన్ చేస్తుండు.. గిన్ని దినాల్ ఏం చేస్తుండు' అన్నాడు

జరుగుతున్న గుడంబా తయారీగురించి పట్టించుకోకుండా ఏం చేస్తున్నావని హెడ్‌ని నిలదీయబోతున్నాడనుకున్నా. హెడ్ వచ్చి సెల్యూట్ కొట్టి నిలబడ్డాడు.

'గిదేందిరా. గీ కొత్త పోరగాడు దిమాగ్ తింటుండు. మన యాద్గిరు మామూళ్ళు పంచుడు మానేసిండా' అని అడిగాడు.

'లే.. నాగా పెట్టుడే లేదు సారూ. ఒకటో తారీకు రావటం ఆలీసెం మామూళ్ళు మన కాడికి పంపిస్తడు"

'మరి ఈడి లొల్లేందిరా..సరిగ్గా పంచుడు చేయట్లేదా? మన యాద్గిరి ధందా మీద రెయిడింగ్ చేయమంటుండు యిన్నవా?'

ఆ మాటలకు హెడ్ నావైపు వంకరగా నవ్వుతూ చూసి యస్సయ్ వైపు తిరిగి 'దొరగారకి తెలీని యిసయం ఏముంటది... ఈడు సత్తెకాలపు మడిషి. మామూళ్ళు ముట్టడు. నేను సముజాయిస్తాలే సారూ' అన్నాడు.

యిప్పటివరకూ నాలో ఉన్న ఉత్సాహం నీరుగారిపోయింది. నేను ఇన్నాళ్ళూ కన్న కలలు ఆ దెబ్బతో కల్లలైపోయాయి.

ప్రభుత్వం తయారుచేసే మద్యం తప్ప ప్రైవేట్ వ్యక్తులు సారాయి తయారు చేయకూడదు.. కానీ మామూళ్ళు తినేసి కళ్ళు మూసుకుని అకృత్యాల్ని ప్రోత్సహిస్తున్నారు వీళ్ళు.

స్నేహితుల్తో చెప్పుకుని బాధ పడితే 'పోనీలే... షాపుల ద్వారా విక్రయిస్తున్న మద్యం విషయంలోనయినా నువ్వు రూల్స్ ప్రకారం వాళ్ళని కంట్రోల్ చేయవచ్చు' అన్నారు. మళ్ళా కొద్దిగా ఆశ చిగురిస్తూ...

రెండ్రోజుల క్రితం హెడ్‌తో కలిసి నల్లకుంట వైపు చెకింగ్‌కి వెళ్ళా. దుర్గా వైన్స్ ముందు జనాలు కూచుని తాగుతున్నారు. షాపు మూసేయాల్సిన సమయం దాటి గంట పైగా అయింది.

'సార్... వీడు చూశారా రిటైల్ షాపుని ఓపెన్ బార్ చేసేసాడు... గంట ముందే షాపు మూసేయాల్సింది పోయి యింకా అమ్ముకుంటున్నాడు సార్. కేస్ బుక్ చేయండి' అన్నా.

హెడ్ వెళ్ళి షాపు ముందు నిలబడగానే క్యాష్ బాక్స్ దగ్గర కూచున్న వ్యక్తి విష్ చేసి చేతిలో కొన్ని నోట్లు పెట్టాడు. హెడ్ నవ్వి 'గిస్మంటి యిసయాలు పెద్దసార్లకు తెల్వకుండా నేను బచాయించుకుంట. బేఫికర్‌గా దందా చేస్కోండ్రి' అంటూ అభయమిచ్చి వచ్చాడు.

'అదేంటి సార్...యిలా మనుషులు రోడ్లమీదే తాగితే ఎంత న్యూసెన్సో మీకు తెలీదా? దారినపోయే ఆడాళ్ళ పరిస్థితి గురించి ఆలోచించారా? ఐనా రూల్స్‌కి విరుద్ధంగా షాపు యింత రాత్రి వరకూ తెరిచి ఉంచటం తప్పు కాదా' అన్నాను వస్తున్న కోపాన్ని పళ్ళబిగువున అదిమి పడ్తూ.

'తాగనీ బిడ్డా... అందర్నీ మస్తుగ తాగనీ... గవుర్నమెంటుకి కావల్సింది కూడా గదే కదా. పోయిన్నెలతో పోలిస్తే గీ నెల అమ్మకాల్ల పదిహేనుశాతం చడావ్ కన్పడాలని మనమేగా ప్రెషర్ చేస్తున్నం. ఏపి బివరేజెస్ నుండి తెచ్చుకున్న సరుకు పూరా అమ్ముకోవాలిగా పాపం. సావనీ... నీకూ నాకూ నష్టమేంది? పబ్లిక్ ఎంత ఫుల్లుగా తాగితే ప్రభుత్వానికంత ఆమ్‌దానీ. గీ షాపు ఓనరు దండిగా పైసల్ సంపాయిస్తే మన జేబులు కూడా గలగల్లాడ్తయ్. అందరికీ ఫాయిదానే ఫాయిదా' అంటూ నవ్వాడు.

'తాగేవాడికేంటి లాభం? యిల్లూ వళ్ళూ గుల్ల చేసుకోవటమేగా... ఎన్ని సంసారాలు యిలా నాశనమౌతున్నాయో ఆలోచించరా' ఈ సారి కోపాన్ని అదుపులో పెట్టుకునే ప్రయత్నమేదీ చేయలేదు.

'నువ్వూ నేను సోచాయించి ఏం లాభం బిడ్డా. గీ ప్రభుత్వమే ఆలోచించటం లేదు. గతేడాదితో పోలిస్తే గీ సంవత్సరం మద్యం అమ్మకాల్లో చారనా పెంచాలని టార్గెట్‌గా పెట్టుకుంది. మనమా ప్రభుత్వోద్యోగులం. యథా రాజా తథా ప్రజ కదా. అందుకే ఈళ్ళచేత మస్తుమస్తుగ తాపించటం కూడా మన డ్యూటీలో భాగమే' అన్నాడు.

నా కోపం నషాళానికెక్కింది. 'అలాగైతే నాకీ డ్యూటీనే వద్దు. మీరు మనుషుల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. వాళ్ళ ప్రాణాల్ని ఫణంగా పెట్టి వ్యాపారం చేస్తున్నారు. మీరు మనుషులు కాదు రాక్షసులు... ప్రజల చేత మద్యం తాగించి వాళ్ళ రక్తం తాగుతున్నారు...'

'ఎందుకంత ఎమోషనల్ అవుతావు... ఆళ్ళెవరో తాగి తందనాలాడితే నీకూ నాకూ ఏం నష్టం?'

'నాకు నష్టమే. నాలా ఈ దేశంలో ఎంత మంది అభాగ్యులు నష్టపోతున్నారో. తాగి తాగి మానాన్న చచ్చిపోయిన విషయం మీకు తెలుసా... తాగొచ్చినపుడల్లా మా నాన్న రాక్షసుడిలా మారి మమ్మల్ని హింసించేవాడు తెలుసా... అదుగో అక్కడ కూచుని తాగుతున్నారే.. వాళ్ళని చూడండి.. మా నాన్నలానే వాళ్ళూ రోగాల్తో చచ్చిపోతారు. అనాథలు కాబోయే వాళ్ళ పిల్లల్ని తల్చుకుంటే గుండె తరుక్కుపోతోంది. కూలో నాలో చేసి సంపాయించిన కాసిని డబ్బులూ తాగడానికి తగలేస్తే ఆకలితో అలమటించే పిల్లలకు ఏం వండి పెట్టాలా అని తల్లులు పెట్టే కన్నీరు మీకు పట్టదా? నేనీ నీచమైన ఉద్యోగం చేయలేను. రేపే రిజైన్ చేస్తాను'

'మంచిగున్నవే... గిన్నాళ్ళ సంది నువ్వు సత్తెకాలం మడిసివనే అనుకున్నా. పాగల్ లెక్కన ఉన్నావే. తొందరపడి గస్మంటి పని చేయకు' అన్నాడు హెడ్డు నన్ను ఓదారుస్తూ.

ఆ రోజు యింటికి వెళ్ళేప్పటికి బాగా రాత్రయింది. మరునాడుదయం నా బాధని ఆవేదనని ఆపుకోలేక పూర్ణతో ఉద్యోగం మానేస్తానని చెప్పాను. అదిప్పుడు మెల్లగా రాజుకుని కార్చిచ్చులా మారబోతుంది.

ఆలోచనలతోనే తెల్లారిపోయింది.

ఉదయాన్నే మామగారు పూర్నుంచి వూడిపడ్డారు. పూర్ణ ఫోన్‌చేసి పిలిపించి ఉంటుందని అర్థమైంది.

యూనిఫాం వేసుకుని డ్యూటీకి బయల్దేరబోయే ముందు "మీతో కొద్దిగా మాట్లాడాలి" అన్నాడాయన.

"సరే. చెప్పండి" అంటూ ఆయనకెదురుగా కుర్చీ లాక్కుని కూచున్నాను.

"ఉద్యోగం మానేస్తానన్నారట"

నేనేమీ సమాధానం యివ్వలేదు.

"ఈ రోజుల్లో గవర్నమెంట్ ఉద్యోగాలు దొరకటం అంత సులభం కాదు. మీ అదృష్టంకొద్దీ ఎక్సయిజ్ కానిస్టేబుల్‌గా సెలక్టయినారు. ఎంత గొప్ప ఉద్యోగం మీది! ఎంత గౌరవం! అటువంటి ఉద్యోగాన్ని వదిలేసే పనిమాత్రం దయచేసి చేయకండి."

"నేను ఉద్యోగం మానేస్తే ఆర్థికంగా మీమీద భారం పడ్తుందనుకుంటున్నారేమో.

అలాంటి భయాలేమీ పెట్టుకోకండి. నావాళ్ళని ఎలా పోషించుకోవాలో నాకు తెలుసు" అన్నాను లేచి నిలబడ్తూ.

"మీ నాన్న లేరు కాబట్టి మన రెండు కుటుంబాలకు సంబంధించి వయసులో పెద్ద వాణ్ని నేనే. నామాటమీద గౌరవం ఉంచండి. తొందరపడి రిజైన్ చేయకండి" అన్నారాయన.

సరేనన్నట్టు తలూపాను.

యింత మంది చెప్తున్నారు కాబట్టి తొందరపడకూడదనే అనుకున్నాను. మరికొన్నాళ్ళు వేచి చూశాక ఓ నిర్ణయానికి రావాలనుకున్నాను.

ఆఫీసుకెళ్ళాక మా సి. ఐ గారు అందర్నీ పిలిచి మీటింగ్ పెట్టారు.

"నిన్న ఎక్సయిజ్ కమీషనర్‌గారు మీటింగ్ పెట్టిన విషయం మీకు తెలుసు కదా. వారు చెప్పిన ముఖ్యమైన విషయాలు మీతో చెప్దామనే మిమ్మల్ని పిలిచాను. మనకీ సంవత్సరం మద్యం దుకాణాల వేలంద్వారా దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. గతేడాదితో పోలిస్తే యాభై శాతం ఎక్కువ టెండర్ వేసి షాపులు దక్కించుకున్నారు. అందుకని షాపులు తెరిచి ఉంచే సమయం విషయంలో మనం చూసీ చూడనట్టు వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మరోనెలలో సంక్రాంతి పండగ వస్తోంది. రైతుల చేతుల్లో పంట అమ్మిన డబ్బు పుష్కలంగా ఉంటుంది. వాళ్ళని ఆకర్షించడానికి రిటైల్ షాపులవాళ్ళు కూడా రకరకాల డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నారు. ఈ నెలతో పోలిస్తే వచ్చే నెల అమ్మకాలు రెండింతలు కావాల. ఆ దిశగా మీరందరూ ప్రయత్నించండి. ప్రభుత్వ ఖజానా నింపే వాటిలో మన శాఖ రెండో స్థానంలో ఉందన్న విషయం మీ అందరికీ తెలుసు. రాబడిని యింకా పెంచే మార్గాలు ఆలోచించండి. అందరిచేతా బాగా తాగించండి. గవర్నమెంటుకి రాబడి తెచ్చే విషయంలో మన శాఖ ప్రథమ స్థానంలో నిలవాలని నా కోరిక. దానికి మీ అందరి సహకారం అవసరం" అన్నాడు.

అప్పుడు వచ్చింది కోపం నాకు. మా మామగారికిచ్చిన మాటకూడా మర్చిపోయాను.

"రైతులు కష్టపడి చెమటోడ్చి సంపాయించిన డబ్బురా అది. అప్పులు చేసి ఎరువులు కొని పండించిన పంటరా అది. పెళ్ళాం బిడ్డల అవసరాలు తీర్చకుండా మీ ఖజానా నింపడం కోసం వాళ్ళ చేత తాపిస్తార్రా..మీరు పురుగులు పట్టి పోతార్రా" అని అరిచాను.

సి.ఐ గారికి రోషం పొడుచుకొచ్చింది. "ఆఫ్టరాల్ కానిస్టేబుల్ వి. నన్నే ఎదిరిస్తావా... నిన్నీ క్షణమే  సస్పెండ్ చేస్తున్నా" అన్నాడు.

"నువ్వేంటి సస్పెండ్ చేసేది. నేనే ఈ ఉద్యోగం వదిలేస్తున్నా. వ్యవసాయం చేసుకునైనా బతుకుతాను గానీ ఇలా ప్రజలచేత తాగించి బతికే దరిద్రపు బతుకు నాకొద్దు" అనేసి బైటికి వస్తున్నపుడు యిన్నాళ్ళూ గుండెల్లో మోసిన బరువేదో తొలగిపోయి మనసు తేలిక పడిన భావన...

పోరాడాల్సింది సారా రాక్షసితో కాదు... దాన్ని పెంచి పోషిస్తున్న ప్రభుత్వంతో అని ఆ క్షణమే నిర్ణయించుకున్నా.

(నవ్య దీపావళి ప్రత్యేక సంచిక 2011)